# కాకి - నక్క

రెండురోజుల నాగాలకూ మూడు రూపాయలు పోతాయే ఈనెల ఎలా గడుస్తుందా అని దిగులుపడ్డ సుందరానికి, క్యాషియరు 47 రూపాయల వోచరిచ్చి సంతకం పెట్టమనే టప్పటికి అపరిమిత ఆశ్చర్యం కలిగింది. తన కళ్లని తానే నమ్మలేకపోయాడు. ఐదురూపాయల యింక్రిమెంటూ? ఒక్క సారే, అదీ అనుకోకుండా! సుందరం డబ్బు జేబులో వేసు కుని యకాయకిని ఆఫీసు మేనేజరు డేవిడ్ దగ్గిరికి వచ్చి "థ్యాంక్స్యూ! ఈ యుద్ధపురోజుల్లో తమరు చేసిన సహాయం మర్చిపోలేను" అన్నాడు గద్గదస్వరంతో. ఆనందంతో అతని గొంతు పట్టుకుపోయింది. అంతకంటే తన కృతజ్ఞతని ఇంకో విధంగా వెల్లడించలేకపోయాడు. 'భార్యాపిల్లలూ బతికి నంతకాలం చెప్పుకుంటారు' అనేది ఇడియం. కాని, సమ యాని కది గుర్తురాలేదు.

"నేను చేసిందేముందీ? ఆ క్రెడిట్ అంతా బాస్ కే చెందుతుంది" అన్నాడు డేవిడ్.

"ఏదో, తమరు పైకలా అంటారుగాని . . . నిజానికి బాస్ తో మాకు టచ్ ఏముంది చెప్పండి? తమ కింద పని చేసేవాళ్ళం. తమరు కనిపెట్టి ఉండకపోతే——"

వాక్యం పూర్తికాకమునుపే వ్యాకుమ్ బ్రేకుపడింది. తోటిక్లర్కు నరహరి గదిలోకి తొంగిచూసి, బహుశా తను ఉన్నాడని కామాలు వెళ్ళిపోయాడు. సుందరానికి కొత్త ఐడియాతట్టింది. తన ఇంక్రిమెంటు సంగతి తెలుసుకుని నాకు

కూడా ఇంక్రిమెంటు ఇవ్వమని అడగటానికి కాదుగదా, నరహరి వచ్చింది? ఏమో?

"చూడండి. ఆఫీసుస్టాఫ్ అందరికీ ఇంక్రిమెంటిచ్చారా?"

"ఆఁ" అన్నాడు మేనేజరు కాగితాలు చూసుకుంటూ. సుందరం ఉత్సాహం సగం చచ్చింది. "నరహరికీ? ఐమీన్"

"అతనిక్కూడా, కొత్తగా చేరినవాళ్లందర్నీ ఒకే గ్రేడులో వేశారు."

"అంటే?"

"అతనికీ యాభై చేశారు" అని మేనేజరు తలఎత్తి చూసేవరకు సుందరంముఖం పాలిపోయి ఉంది. మూర్ఛపోవటానికి సిద్ధంగా ఉన్నాడు. డేవిస్ కు జాలివేసింది.

"కూర్చోండి. సోడా తెప్పించనా?" అన్నాడు.

"థ్యాంక్సు! అక్కర్లేదు. మొన్న జబ్బుపడి లేచినప్పటి నించీ కాసేపు నిలబడితేచాలు, కళ్ళు తిరుగుతున్నై" అని మొదలుపెట్టి సుందరం తన జబ్బులో ప్రతిమైనరు డిటైలూ ఏకరువుపెట్టాడు. మేనేజరులో సైకలాజికల్ ఛేంజి గమనిస్తూ అతని సానుభూతి కొంత ఆర్జించాననే నమ్మకం కలగగానే సుందరం అన్నాడు: "చూడండి, నేనొకళ్ళమీద అసూయ పడుతున్నానని అనుకోకండి. న్యాయం మాట్లాడుకుందాం– నరహరీ నేనూ ఒకమాటే చేరాం గదా, ఐనురూపాయల వారతో, ఈరోజున ఇద్దర్నీ కలపటం ధర్మమా?"

"అధర్మం మాత్రమేముంది లెండి. అతనూ కష్టపడుతున్నాడు—"

"ఐతే నేనేగా వొళ్లు దాచుకొనేది? మీరు చెప్పటం–"

"ఎబ్బే నన్ను చెప్పనిస్తేగదటయ్యా నువ్వు?" అన్నాడు, మేనేజరు విసుగుతో. సుందరం జావ అయిపోయాడు.

"పెద్దలు తమరే అలా కోప్పడితే ఎలా? మా కష్ట సుఖాలు తమరు గమనించకపోతే ఇంకెవ్వరున్నారు?"

"గమనించకపోవడం కాదయ్యా! నేను చేసిందిగానీ చెయ్యగలిగిందిగానీ ఏమీ లేదు. బాస్ కలా బుద్ధి పుట్టింది, ఇచ్చాడు."

"నామీద ఏమన్నా కోపమా, వారికి?"

ఇది చాలా తెలివితక్కువ ప్రశ్న అన్నట్టు మేనేజరు పకపక నవ్వాడు. సుందరం సిగ్గుతో కుంగిపోయాడు కుర్చీలో.

"పిచ్చివాడా వారికి కోపమొస్తే మన ముంటామా ఈ ఆఫీసులో."

"మరి నా పనే సంతృప్తికరంగా లేదా, వారికి?"

"సంతృప్తికర మేమిటి? చాలా ప్లీజ్ అయాడు. మొన్న ఈమధ్య ఫైల్సు తిరగవేస్తూ, 'మనసుందరం లేకపోతే ఈ కరస్పాండెన్సు ఇంత నీట్ గా ఉండేదా?' అన్నారు. నేను 'నీట్ గా ఉండడమే కాదు. అతను లేకపోతే ఈపనికి ఇద్దర్ని పెట్ట వలసివచ్చేది!' అన్నాను.

"వా రేమన్నారు?" అన్నాడు సుందరం, అతనికి కొంచెం వ్యక్తిత్వం వచ్చింది.

"ఏమంటారు? నాలుగైదు ఆఫీసుల్లోపనిచేసిన వాడికి అంతమాత్రం అనుభవముండదా? అన్నారు. నాకు మట్టుకు నువ్వొకపూట సెలవుపెడితే, పనులన్నీ ఆగిపోయినట్టుంటై."

"ఇది మీరు సిన్సియరుగా చెప్పే దేనా?"

"కాక! నిన్ను పొగడాల్సిన అవసరం నాకేముంది?"

"మరి నాకు జీతం తగ్గించడం—"

"తగ్గించటం కాదయ్యా, అది! పదిరూపాయలు పెంచకపోవటం."

"సరే, అలాగే అనుకోండి, ధర్మమంటారా అది?"

"ఎలా అంటాను? కాని, నేను చేయగలిగిందేముంది?"

"లేకేమి లెండి. మీరు చెప్తే కాదంటాడా, బాస్! కొంచెం చెప్పిచూడండి."

"అలాగే" అన్నాడు మేనేజరు.

మర్నాడు లంచ్ విరామంలో సుందరం మేనేజర్ని కలుసుకున్నాడు. మేనేజరు నాలుగైదు 'Excuse me' లూ రెండుమూడు సారీలూ కలిపి, తను చాలా చెప్పిచూసినట్టూ లాభమేమీ కనపడనట్టు తేల్చాడు.

సుందరం ఏమీ మాట్లాడలేదు. తను ఒకవిధంగా ఈ ప్రత్యుత్తరాన్ని ఆసించివచ్చినట్టే మేనేజరికి కనిపించాలని మాత్రం ప్రయత్నించాడు.

సుందరం ఆవాళ యిక మామూలు ఉత్సాహంతో ఉత్తరాలు టైపుచేయలేక పోయాడు. సైకలాజికల్‌గా, కాని చాలా యాప్ట్‌గా, కొన్ని తప్పులు పడ్డాయి.

మేనేజరుకి యివేమీ ఆశ్చర్యం కలిగించలేదు. కాని సాయంత్రం సుందరం వారంరోజులు గడువిచ్చి రాజీనామా దాఖలుచేయటంమాత్రం అతన్ని చకితుణ్ణిచేసింది. విత్‌డ్రా చేసుకోమని సుందరానికి చాలా చెప్పిచూశాడు.

సుందరం వొప్పుకోలేదు. నౌకరిచేస్తున్నప్పటికీ తనకు

ఆత్మాభిమానం చావలేదన్నాడు.

మర్నాడు సుందరం తనే స్వయంగా బాస్ దగ్గరికి పోయాడు, సంతకాలు చేయించటానికి. బాస్ తల ఎత్తకుండానే సంతకాలుచేసి కాగితాలు అవతలకి నెట్టాడు. సుందరం ఆఫీసు విషయమై ఒకటిరెండు సంగతు లడగదలచుకున్నాడు; కాని బాస్ తల బిరుసుతనం అతని ఆత్మాభిమానాన్ని మళ్లీ రేగ గొట్టింది.

నిమిషాలు రోజులుగానూ, రోజులు యుగాలుగానూ గడిచిపోతున్నై సుందరానికి. ఒడ్డునపడ్డ చేపలాగా ఉన్నది అతనిస్థితి. మేనేజరు అప్పుడప్పుడు తోటిగుమస్తాలకు యిస్తున్న వుపదేశాలు వింటున్నాడు. అవి ఎవరికి వుద్దేశించినవో కూడా గ్రహించాడు. ఐనా, సుందరానికి మేనేజరు మీదకంటే తోటిగుమస్తాలమీదనే ఎక్కువ కోపమొచ్చింది. పిరికివెధవలకి అవు ననటం తప్ప, మరేమీ చాతకాదు! స్వబుద్ధి నెప్పుడో తాకట్టుపెట్టారు!......

గడువునాటిసాయంత్రం సుందరం తోటిగుమస్తాల సమవేదనా సహాయంతో మేనేజరు గదిలోకివచ్చి, గుడ్ బై చెప్పాడు. మేనేజరులో ఏమీ మార్పులేదు. వెనకటి మాటలే చెప్పాడు. రేపటినించీ సుందరంలేకపోతే పనులెలా జరుగుతాయో ననికూడా చింతిల్లాడు.

బాస్ ఆఫీసులో లేడు. అంచేత సుందరం అతనిదగ్గర సెలవుతీసుకో లేక పోయాడు. ఆ లోటు అతనికి పెద్దదిగానే కనిపిస్తుంది. 'చెప్పిపోవటం ధర్మం' అంటున్నది మనస్సు. కాని, ఎలా చెప్పిపోవటం? ఆఫీసులో ఉంటేగా!

సుందరం ఆఫీసు బయటికి వచ్చాడు. అతని కాళ్లు బలవంతాన ముందుకు సాగుతున్నాయో కాని, మనస్సుమాత్రం ఆఫీసువేపుకి లాగుతున్నది. ఇదివరకు అతనికి గాంధిగారి ఇన్నర్ వాయిస్ మీద నమ్మకం ఉండేదికాదు. కాని, ఇప్పుడతనికి అదేమిటో అనుభవం కాసాగింది. 'నిన్నొ నులుకో లేరు వాళ్లు, వాదులుకోలేరు' అని చెవులు పగిలిపోయేటట్టు లోపలినించి ఏదోశబ్దం వస్తున్నది,—

"స్వామీ!"

ఆఫీసు బంట్రోతు కేక! సుందరం వొళ్లు ఒక్కసారిగా జలదరించింది. అతనికి పోలిశెట్టి జ్ఞాపకం వచ్చాడు. అక్కడ్లేదని వెళ్తుంటేగాని, అతను పిలిచి తను అడిగిన ధరకి సరుకిచ్చే వాడు కాడు. వీళ్లూ అంతే! వీళ్లదిమాత్రం వ్యాపారం కాదా? ఇలా ఆ ఒక్క క్షణంలోనే ఇంకా ఎన్నో ఆలోచనలు కలిగినై సుందరానికి.

"ఏమిటోయ్?" అన్నాడు బంట్రోతుతో, కొంచెం ధీమాగా, లోపల కలిగే సంతోషాన్ని బలవంతాన అణిచి.

"తమరు గొడుగు మరిచిపోయి వొచ్చారు," అంటూ గొడుగు అందించాడు, బంట్రోతు. సుందరానికి వాడిచేతిలో గొడుగుచూచినప్పుడు కూడా తన గొడుగుసంగతి గుర్తుకు రాలేదు. అతని జ్ఞాపకశక్తి అతన్ని ప్రతిదఫా సమయానికి దగా చేస్తూనే ఉన్నది.

బంట్రోతు ఇవాళ బహుమాన మేమీ ఆశించకుండానే తిరిగిపోయాడు.

మర్నాడు సుందరానికి ఆఫీసునించి కబురు వచ్చింది. అది

చించి చదివేలోపల అతని మనసు ఎన్నివిధాలనో పోయింది. అందులో ఆశే ప్రాధాన్యం వహించింది. కాని, ఉత్తరంలో ఆసూచన లేవీ కనపడలేదు. అతనికి రావలసిన జీతం వచ్చి తీసుకుపొమ్మని ఉంది.

మూడుగంటలు ఆలోచించినమీదట సుందరం ఆవాళ ఆఫీసుకు పోగూడదని తేల్చుకున్నాడు. డబ్బు తెచ్చుకోవలసినపనీ, ఆ డబ్బుతో అవసరం ఉన్నప్పటికీ. ఆవాళే పోతే ఉద్యోగంకోసం వచ్చాడని అనుకుంటారని అతని భయం.

ఐనా, సాయంత్రం అటు వెళ్లకండా ఉండలేకపోయాడు. ఆతని మనస్సు బలవంతాన అటు లాక్కుపోయింది.

ఆఫీసుముందర ఎవరూ కనబడలేదు. సుందరం ఆఫీసుకి దగ్గరలోఉన్న కిల్లీషాపుముందు నుంచున్నాడు, బీడీలుకొని కాలుస్తూ. కాసేపటికి ఆఫీసు బంట్రోతు మాసిలామణి ఇంటికి పోవటానికి బయలుదేరాడు. సుందరం వాడివెనక కొంతదూరం నడిచి "మాసిలామణీ!" అని పిలిచాడు.

తిరిగి చూశాడు బంట్రోతు. "ఏమోయ్! ఇవాళ యింత ఆలస్యంగా పోతున్నావు! టపా వేళకి పోలేదా, ఏమిటి?"

"ఏమి వేళసామీ! ఇవాళ గాడిదబరువున్నై ఉత్తరాలు" అన్నాడు మాసిలామణి. "ఎవర్ని వేశారోయ్ కొత్తగా?"

"చిన్నదొరగారి బావమరిదట! కాస్తె లేదు, ఏమి మండిస్తున్నాడు?"

ఎలామండిస్తున్నాడో వివరాలు తెలుసుకోలేదు సుందరం. మళ్లీ కనబడతానని వాడితో చెప్పి, తప్పుకుపోయాడు.